క్లుప్తంగా

6వేల గృహాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఆదివారంతో మండలంలో 6వేల కుటుంబాలకు వైద్య సేవలు అందించినట్లు అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ తెలిపారు. ఈ సర్వేలో ప్రతి ఇంటికి తిరిగి షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ శాతం వంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జ్వరం, మలేరియా, డెంగీ పరీక్షలు కూడా చేస్తున్నామన్నారు. గుండె, లివర్, ఊపిరితిత్తులు, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల రోగులకు టోకెన్‌లు ఇస్తున్నామన్నారు. మండలంలో ఉన్న మొత్తం 13 వేల గృహాలకు వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలను వచ్చే నెల 6 నాటికి పూర్తిచేస్తామన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు సువర్ణావకాశం



పరీక్ష ఫీజు చెల్లింపునకు అక్టోబరు 3వ గడువు

అచ్చంపేట: ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షలు రాసేందుకు అక్టోబరు 3లోపు ఫీజు చెల్లించవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.పద్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది, గతంలో జరిగిన పబ్లిక్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులందరికి 2024 మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులంతా తరగతులకు హాజరుకావచ్చన్నారు. పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించిన విద్యార్థులకు సదరు సబ్జెక్టుపై బోధన చేసేందుకు తమ కళాశాలకు చెందిన అధ్యాపకులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించి, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జె.పద్మ కోరారు. పూర్తి వివరాలు కళాశాల పనిదినాలలో సంప్రదించవచ్చన్నారు.

భగవద్గీతను బ్రహ్మవిద్యగా గుర్తించాలి

అచ్చంపేట: భగవద్గీతలోని ప్రతి అక్షరం చాలా విలువైనదని, దానిని బ్రహ్మ విద్యగా గుర్తించాల్సిన అవసరం ఉందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూజ్ఞాన వేదిక అధ్యక్షులు కటకం సైదారావు అన్నారు. స్థానిక విద్వాన్ హైస్కూలు ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి సహకారంతో ఆదివారం అచ్చంపేట పురవీధులలో శ్రీకృష్ణభగవాన్ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. ఆయన ఉపదేశించిన గీతాపారాయణం గురించి వివరించారు. భగవద్గీత గ్రంథాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. హిందూజ్ఞాన కమిటీ సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, గోపీ, శ్రీను, వీరయ్య, వెంకటలక్ష్మి, అనూరాధ, శివ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

120 మందికి కంటి పరీక్షలు

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మేకల సీతమ్మ, వెంకయ్య దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు మేకల సాంబశివరావు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన సిరి కంటి వైద్యశాల వైద్యులు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. సర్పంచ్ అయ్యపరాజు, మాజీ జెడ్పీటీసీ ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కొరటాల కృషి



సత్తెనపల్లి: చేనేత రంగ సమస్యల పరిష్కారానికి సీపీఎం నాయకుడు కొరటాల సత్యనారాయణ చేసిన కృషిని మరువలేమని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు కట్ట శివదుర్గారావు అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన కొరటాల సత్యనారాయణ శతజయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివదుర్గారావు మాట్లాడుతూ కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ విద్యార్థి దశలోనే రాజకీయాలకు ఆకర్షితులై స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంపిచర్ల పురుషోత్తం, అనుముల వీర బ్రహ్మం, పంతంగి ప్రభాకర్, గద్దం సుసు లోన్, మామిడి జగన్నాథరావు, పొట్టి సూర్యప్రకాశరావు, షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.

నిండు మనసుతో మరియ తల్లిని ప్రార్థించండి

విజయపురిసౌత్: దేవుని కృప వలన లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియతల్లి పరమ పవిత్రురాలిగా కీర్తి పొందారని సాగర్ మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్ మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. భక్తులు నిండు మనసుతో మరియతల్లిని ప్రార్థిస్తే ఆ తల్లి దీవెనలు అందిస్తుందన్నారు. అనంతరం సాగర్‌మాత దేవాలయం చుట్టూ భక్తులతో కలిసి తేరు ప్రదక్షిణలు చేసి ఆశీర్వాదం అందజేశారు. భక్తులు సాగర్‌మాత దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి, తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'

- ఈ నెల 30 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు
- 14 రకాల వైద్య సేవలతో పాటు ఇతర రుగ్మతలకు ఉచిత వైద్య పరీక్షలు
- ఇప్పటికే ఆశ వర్కర్లు, వలంటీర్లతో ఇంటింటి సర్వే
- నియోజకవర్గంలో అందరికీ అందనున్న వైద్య సేవలు



లక్కరాజుగార్లపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



భట్లూరులోని ఓ ఇంటి వద్ద సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: మారుమూల పల్లెల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పల్లెల్లో వలంటీర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. ఏఏ వ్యాధులున్నాయి? వాటికి ఏ మందులివ్వాలి? ఎలాంటి వైద్య సేవలు అందించాలనే వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. చికిత్స అవసరమైన వారికి టోకెన్లు జారీ చేస్తున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు ..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి అక్టోబర్ చివరి వరకు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంలో వైద్య సిబ్బంది 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఇతర జబ్బులను కూడా గుర్తించి కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో బీపీ, షుగర్, మలేరియా, హిమోగ్లోబిన్, డెంగీ, యూరిన్, గళ్ల పరీక్షలతో పాటు ఇతర రుగ్మతలను గుర్తించి వారికి ఉచితంగా ప్రభుత్వమే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించనుంది. ఈ మేరకు ఇప్పటికే సర్వే ద్వారా రోగుల వివరాలను సేకరిస్తున్నారు.

సచివాలయాల్లో..

సత్తెనపల్లి పట్టణంలో 31 వార్డులు, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 73 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 75 సచివాలయాలు ఉన్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద అన్ని సచివాలయాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. సర్వేలో పొందుపరిచిన కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ప్రతి ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారు.

ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు

నియోజకవర్గంలోని సత్తెనపల్లి రూరల్ మండలంలో ఇప్పటికే అధికారులు రెండు బృందాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ నెల 30 న పెద్దమక్కెన కొత్త సచివాలయం, అక్టోబర్ 3న నందిగామ-1 జిల్లా పరిషత్ హైస్కూల్, అక్టోబర్ 4న గుడిపూడి ఎంపీపీ పాఠశాల, 5న నందిగామ-2 జెడ్పీ హైస్కూల్, 6న భీమవరం గ్రామ పంచాయతీ కార్యాలయం, 7న కంటెపూడి ఎంపీపీ పాఠశాల, 9న అబ్బూరు గ్రామ పంచాయతీ కార్యాలయం, 10న కొమెరపూడి పంచాయతీ కార్యాలయం, 11న ఫణిదం-2 పాఠశాల, 12న లక్కరాజుగార్లపాడు సచివాలయ భవనం, 13న భట్లూరు ఎంపీఈ పాఠశాల, 16న ధూళిపాళ్ల సచివాలయ భవనం, 17న కట్టమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం, 18న బృగుబండ కొత్త సచివాలయ భవనం, 19న రెంటపాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 20న కందులవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాల యం, 21న పాకాలపాడు గ్రామ సచివాలయం, 25న కంకణాలపల్లి రైతు భరోసా కేంద్రంలో ఈ వైద్య శిబిరాలు కొనసాగుతాయి. ఈ మేరకు టోకెన్లు జారీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో ఎంపీడీఓ, తహసీల్దారు, వైద్యాధికారులుతో పాటు నలుగురు ప్రత్యేక డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యశిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారు. ఒక వేళ ఎవరైనా టోకెన్ పొంది ఆయా తేదీల్లో శిబిరానికి హాజరు కాలేకపోతే.. వారికి మరో రోజు వైద్య పరీక్షలు ఏర్పాటు చేయనున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కృష్ణకుమార్ గణపవరంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. టోకెన్‌లు తీసుకున్న ప్రతీ ఒక్కరు ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఆయా గ్రామాలలోని గ్రామ సచివాలయ పరిధిలో స్పెషలిస్టు వైద్యాధికారులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెమలిపురి, కొండమోడు, అనుపాలెం, మొక్కపాడు, కొత్తూరు గ్రామాలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి



వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి. వైద్య శిబిరాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే శిబిరాల నిర్వహణ తేదీలను గ్రామాల వారీగా వివరించాం. వైద్యాధికారులు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, అధికారులు సమావేశమై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. శిబిరాల ఏర్పాటుకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాం.

–జీవీ సత్యనారాయణ, ఎంపీడీవో, సత్తెనపల్లి.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు



ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఇంట్లోని ప్రతి కుటుంబ సభ్యునికి వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఎవరెవరికి ఏఏ రుగ్మతలు ఉన్నాయో తెలుసుకొని వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తాం. ఇతర రుగ్మతలు ఉంటే ప్రత్యేక వైద్యాధికారుల ద్వారా రుగ్మతలు గుర్తించి వైద్యపరీక్షలు అందిస్తాం.

–యు.శ్రీలక్ష్మి కవిత, వైద్యాధికారిణి, ఫణిదం పీహెచ్‌సీ.

నేడు సచివాలయ, ఆర్బీకే భవనాలు ప్రారంభం



రైతు భరోసా కేంద్రం

అమరావతి: వైకుంఠపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. సోమవారం సాయంత్రం 4గంటలకు నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు, పలువురు జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఎంపీడీఓ ఉమాదేవి ఆదివారం తెలిపారు. మండల అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

కౌన్సిలర్ చౌటేశ్వరికి మంత్రి అంబటి పరామర్శ

సత్తెనపల్లి: పట్టణంలోని రెండవ వార్డు కౌన్సిలర్ మాదిగొండ చంటీశ్వరి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో.. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం పరామర్శించారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించేందుకు గుంటూరు వైద్యశాలలో ఆయనే స్వయంగా మాట్లాడి చేర్పించారు. అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. అలాగే పట్టణానికి చెందిన తోట సదాశివరావు ఇటీవల అనారోగ్యానికి గురై గుంటూరు వైద్యశాలలో చేరారు. సదాశివరావు ఆరోగ్యం కుదుటపడి ఇంటికి రావడంతో మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, తిరుపతిరావు, ప్రసాద్ బాబు, నారాయణ, యానాది పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్య... వెళ్లి రావయ్య

- వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు
- పలు మండపాల వద్ద అన్న సంతర్పణలు
- బొజ్జగణపయ్యను సందర్శించిన మంత్రి అంబటి రాంబాబు



రుద్రవరం పూజలో మంత్రి అంబటి రాంబాబు



మహారాష్ట్ర వీధిలో శ్రీలక్ష్మి గణపతి హోమం

సత్తెనపల్లి: వినాయక నిమజ్జనంలో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణలు నిర్వహించారు. పట్టణంలోని 10వ వార్డు నాగార్జునగర్ మెయిన్ రోడ్డులో కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి) ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు సందర్శించారు. మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రిని ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, రాయపాటి పురుషోత్త మరావు, కళ్ళం విజయ భాస్కరరెడ్డి, అచ్యుత శివప్రసాద్, నల్లబోతు శివనారాయణ, అబ్బూరి వీరాంజనేయులు, తోట లక్ష్మీనారాయణ, రేపూడి.రవితేజా, తోట.వెంకటే శ్వరరావు, యానాది ఉన్నారు. పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధి నందు శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానం వద్ద చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు, అన్న సంతర్పణలు, సాంస్కృతిక కార్య క్రమాలు తీర్థ ప్రసాద వినియోగాలు బక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. పట్టణంలోని పతసాలిపేట నందు గణేష్ మహోత్సవాల్లో సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి గుంటూరు సిటీ పట్నంబజార్ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ మేనేజర్ ఎల్.బాలాజీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు అవ్వారు శ్రీనివాసరావు ఉన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలించారు. అందంగా ముస్తాబు చేసిన ప్రత్యేక వాహనాల్లో గణనాథుడిని గ్రామంలో భారీ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. రుద్రవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, శివకేశవ్ పాల్గొన్నారు. కుందురువారిపాలెంలో గడ్డమీద ఏర్పాటు చేసిన వినాయకప్రతిమ వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని సూపూరి వెంకటేష్ రూ.58,100లకు వేలంలో కైవసం చేసుకున్నారు. రుద్రవరంలోని వినాయక లడ్డూ ప్రసాదానికి జరిగిన వేలంలో మార్పుల శ్రీనివాసరెడ్డి రూ.22వేలకు కైవసం చేసుకున్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో గణేష్ యూత్(ఆర్యవైశ్యుల సంఘం) ఏర్పాటు చేసుకున్న గణనాథుడు అత్యంత ఘనంగా నిమజ్జనానికి తరలించారు. స్వామివారి 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని క్రోసూరుకు చెందిన కూరగాయల మార్కెట్ వ్యాపారి చుండూరు సత్యనారాయణ రూ.51 వేలకు కైవసం చేసుకున్నారు. ఆర్యవైశ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



కోలాట ప్రదర్శనలో మహిళలు

నకరికల్లు: స్థానిక సచివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని నిమజ్జన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి అర్చకులు కొడవటిగంటి పాండురంగాచార్యులు, ఫణీశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో యశోదమ్మ నీ కొడుకు ఏడి... అంటూ మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు, యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రూ.20కోట్లతో కొండూరు అభివృద్ధి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- గ్రామంలో మన కోసం – మన శంకరన్న కార్యక్రమంలో



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత నాలుగున్నరేళ్లలో కొండూరు గ్రామంలో రూ.20కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గ్రామంలో ఆదివారం మనకోసం – మన శంకరన్న కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరించినట్లు చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో రూ.13.75కోట్లు, అభివృద్ధి పనుల రూపంలో కలా.5.90కోట్లు గ్రామంలో ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 2019లో కొండూరు గ్రామంలో 395మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చేవారని, ప్రస్తుతం గ్రామంలో మొత్తం 605 పింఛనుదారులకు పింఛను అందజేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామానికి రూ.1.71కోట్లతో ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఇచ్చే పనులు జరుగుతున్నాయన్నారు. నాడు-నేడు ద్వారా రూ.1.58కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తున్నామన్నారు. గ్రామంలో రూ.78లక్షలతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌సెంటర్, డిజిటల్ లైబ్రరీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాలకాలంలో గతనాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిలో కనీసం 10శాతం పనులైనా చేశారా అని ఎమ్మెల్యే నంబూరు ప్రశ్నించారు. మళ్లీ తనకు అవకాశం ఇవ్వాలని పెదకూరపాడును మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, తహసీల్దారు సీహెచ్ పద్మావతి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కనివనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, వైఎస్ ఎంపీపీ గంగసాని బాబు, కొండూరు సర్పంచ్ రామాంజనేయులు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, గ్రామపార్టీ నాయకులు చొప్పరపు రామయ్య, వెంకాయమ్మ, రంగా పాల్గొన్నారు.

కేజీబీవీ అదనపు గదుల నిర్మాణం పరిశీలన

క్రోసూరు: స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో నాడు – నేడు కింద నిర్మిస్తున్న తరగతి గదుల నిర్మాణాలను ఎమ్మెల్యే నంబూరుశంకరరావు ఆదివారం సందర్శించారు. పాఠశాలలో ఎనిమిది అదనపు తరగతి గదులు నిర్మాణానికి రూ.1.03 కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ ఇందిరాప్రియదర్శినితో మాట్లాడి, విద్యాలయ పరిస్థితులను తెలుసుకున్నారు. జెడ్పీటీసీ షేక్‌జమీలాగఫూర్, మండలపార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఖాదర్, ముస్తఫా, నర్రావాసుదేవరావు, జమాలుద్దీన్ పాల్గొన్నారు.

చామర్రులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

అచ్చంపేట: మండలంలోని చామర్రులో సీసీ రోడ్డు, కాంక్రీట్ సైడు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం భూమిపూజ చేసి చేశారు. పనులు వెంటనే ప్రారంభించి త్వరిత గతిన పూర్తి చేయవలసినదిగా అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. జలజీవన్ మిషన్ ద్వారా అచ్చంపేట పంచాయతీ పరిధిలో రూ.5.50కోట్లతో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక వీరభద్రస్వామి కాలనీలో, ఎస్సీ కాలనీలలో కూడా రోడ్లు వేయించాలని ఆయా కాలనీవాసులు కోరారు. వెంటనే అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి, సర్పంచ్ కంభాల వీరబాబు, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, లీడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, గ్రామపార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన ఉండాలి

గురజాల : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని బాని వ మొహ్‌తమిమ్ మద్‌రస మంబ ఉర్‌షాద్ వ ఖతీబ్ మస్జిద్ ఎ ఉమర్ షారూఖ్ బెంగుళూర్ పి.ఎమ్ మజ్జమ్మిల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం తమామ్ ముసల్మానానె , ముస్లిం యూత్ ఆధ్వర్యంలో మజ్లిసుల్ ఉలమా పల్నాడు ఇస్తిమా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరుడు ఖురాన్ మార్గాన్ని అనుసరించాలన్నారు. అంతిమ దైవ ప్రవక్త జీవిత చరిత్ర ప్రస్తుత సమాజంలో పిల్లలపై తల్లిదండ్రుల బాధ్యత గురించి వివరించారు. ఖురాన్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని వేల్పూరుకు చెందిన పలు టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో రాయి. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నందునే చాలా గ్రామాలలో భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మళ్లీ గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిరిలో శిఖా ఆదాం, ఇడుపుల మరియదాసు, ఇడుపుల నాగరాజు, పచ్చల సుబ్బారావు, పచ్చల సంతమ్మ, సావల ప్రభుదాసు, గరికపూడి మహంకాళి, మాతంగి చెంచయ్య, మాతంగి దయామణి, సురెకొండ, సురె వెంకటేశ్వర్లు తదితర కుటుంబాలకు చెందిన సుమారు 50మంది ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వినర్ కోట నాగేశ్వరరావు, కుమారస్వామి తదితరులున్నారు.

బావిలో పడి బాలుడి మృతి



ఇస్తల గణేష్ (పాతచిత్రం)

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామానికి చెందిన ఇస్తల గణేష్(14) అనే బాలుడు పొలానికి వెళ్లి బావిలో శవమై కనిపించాడు. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసరావు, లావణ్య కుమారుడు గణేష్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల ముగిశాక గేదెలు తోలుకొని పొలానికి వెళ్లిన తన తల్లి వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి నేరుగా పొలానికి వెళ్లాడు. చిరుజల్లులు కురుస్తుండటంతో పొలంలో ఉన్న గణేష్ తల్లి లావణ్య గేదెలను తోలుకొని ఇంటికి వచ్చింది. చీకటి పడ్డాక కూడా గణేష్ ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు ఆరా తీయగా పొలానికి వెళుతున్నానని చెప్పినట్లుగా చుట్టుపక్కల వారు చెప్పారు. ఆ మేరకు పరిసర ప్రాంతాలతో పాటుగా బంధువుల ఇళ్లలోను వెతుకులాట చేపట్టిన ఆచూకి లభించలేదు. దీంతో బాలుడి తల్లి దండ్రులు ముప్పాళ్ళ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చిన కాలనీవాసులు పొలానికి సమీపంలో ఉన్న బావిలోని నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడగా లోపల బురదలో కూరుకుపోయి గణేష్ మృతదేహం కనపడింది. శరీరమంతా ఉబ్బి పోయి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శాంతి స్థాపనకు సహకరించండి



దాచేపల్లి : శాంతిభద్రతలను పరిరక్షించటంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ సురేంద్రబాబు అన్నారు. గత రెండు రోజుల క్రితం దాచేపల్లిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ..పండుగలు, ఊరేగింపులు చేసుకునే సమయాల్లో కులాలు, మతాల మధ్య కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కలసిమెలసి ఐకమత్యంతో ఉండాలని, శాంతిస్థాపన కోసం ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కొప్పుల రవి, సయ్యద్ మౌలాలీ, కొలా శ్రీనివాసరెడ్డి, అంబటి మల్లి, మందపాటి దుర్గారావు పాల్గొన్నారు.